## క్లుప్తంగా

### ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, చెన్నారావుపేట, పర్వతగిరి, సంగెం, దుగ్గొండి, రాయపర్తి, తదితర మండలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సంగెం మండలంలోని కుంటపల్లిలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే ఊరూరా నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

### మైసమ్మకు రైతుల పూజలు



దుగ్గొండి : వానాకాలం వరి పంట కోతకు రావడంతో మండలంలోని నాచినపల్లి గ్రామ రైతులు ఈదుల చెరువు కట్టపై ఉన్న ఆలయంలో మైసమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొర్రెలు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించారు. ధాన్యం దిగుబడి అధికంగా రావాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రైతులు మట్ట మొండయ్య, నల్ల రాంరెడ్డి, బొమ్మినేని శ్రీనివాసరెడ్డి, బండారి కొంరయ్య, జటబోయిన బుచ్చివీరు, పెండ్యాల స్వామి, మట్ట నరేందర్, పూజారి నూటెంకి జయ, తదితరులు పాల్గొన్నారు.

### తల్లికి తలకొరివిపెట్టిన కూతురు



రాయపర్తి : కొడుకులు లేకపోవడంతో తల్లికి కూతురే తలకొరివి పెట్టిన విషాద ఘటన మండలంలోని పెర్కవేడులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన నల్ల ఎల్లమ్మ–వెంకన్న దంపతులకు ముగ్గురు కూతుర్లే. కొడుకులు లేరు. దంపతులు ముగ్గురికీ వివాహం జరిపించారు. కాగా ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందగా పెద్ద కూతురు రేణుక తలకొరివి పెట్టింది.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దుగ్గొండి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులోని బీసీ కాలనీ వద్ద శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా.. నల్లబెల్లి మండలంలోని నందిగామకు చెందిన చిమ్మ కార్తీక్, కంచె శేఖర్ గిర్నిబావి నుంచి నందిగామకు వెళ్తుండగా అతి వేగం కారణంగా వారు నడుపుతున్న బైక్ రోడ్డు పక్కన కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో కార్తీక్, శేఖర్ గాయాల పాలయ్యారు. ఇద్దరినీ స్థానికులు 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

### అన్ని వర్గాలకూ ‘ఎస్ఆర్ఆర్’ సేవలు



రాయపర్తి : సమాజంలోని అన్ని వర్గాలకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందిస్తామని వ్యవస్థాపకుడు, చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తన సొంత డబ్బుతో మండలంలోని మైలారంలో ముదిరాజ్ కులస్తుల కోరిక మేరకు చేపట్టిన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. తనకు జన్మనిచ్చిన మైలారం గ్రామంలో చేపట్టే ఎలాంటి అభివృద్ధి పనులకైనా తోడ్పాటు అందించడానికి ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మధుకర్‌రెడ్డి, లేతాకుల మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ నాయక్, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బోయిని కుమార్, యాకయ్య, వెంకటయ్య, రాజిరెడ్డి, అనిల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### కుర్చీల బహూకరణ

ఐనవోలు : మండలంలోని పంథినిలో షాలోమ్ ప్రార్థన మందిరానికి అదేగ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బరిగెల సదానందం– శ్రీలత దంపతులు 100 కుర్చీలు అందించారు. చర్చి ఫాదర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఏజెన్సీ పల్లెలో ‘రియల్’ దందా

- వైద్య కళాశాల, ఆస్పత్రి ఏర్పాటుతోనే..
- నర్సంపేట–పాకాల రోడ్డు భూముల ధరలకు రెక్కలు
- యథేచ్ఛగా ప్లాట్లు, నిర్మాణాలు
- అనుమతి లేకున్నా.. చర్యలు శూన్యం



ప్రహరీ ఏర్పాటు చేసి గది నిర్మించిన దృశ్యం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని రాజుపేటతోపాటు ఆ గ్రామ శివారులోని చింతగడ్డ ఏజెన్సీ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ పీసా చట్టం అమలులో ఉంటుంది. అయినా రియల్టర్లు ప్రభుత్వ అనుమతి లేకున్నా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. కొనుగోలుదారులూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి ప్రారంభోత్సవం కావడంతోనే నర్సంపేట–పాకాల రోడ్డులోని భూముల ధరలకు రెక్కలొచ్చాయన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. రియల్టర్లు, సంపన్నులైన కొనుగోలుదార్లు నిబంధనలు ఉల్లంఘించి ప్రహరీలు, గదులు నిర్మిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో భూదందా జోరుగా సాగుతోంది.

రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని చింతగడ్డ తండా కింద వచ్చే ప్రధాన రహదారిలో కొద్ది రోజులుగా అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. పీసా చట్టం నేపథ్యంలో సర్వే నంబర్ 116, 117ల్లోని భూముల క్రయవిక్రయాలు చట్టరీత్యా నేరం. అయినా రియల్టర్లు ప్లాట్లు చేసి విక్రయిస్తుండగా సంపన్నులైన కొందరు కొనుగోలు చేసి కొందరు సంబంధిత శాఖల ప్రభుత్వ ఉద్యోగులతో లోపాయికారీ ఒప్పందం చేసుకుని ప్రహరీలు, వాటిలోపల గదుల నిర్మిస్తున్నారు. సమీపంలోనే వైద్య కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు కావడంతో కొందరు రియల్టర్లు నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ పరిధిలో ఉన్నప్పటికీ చింతగడ్డ తండా పరిధిలో భూవిక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలుదార్లకు సాదా కాగితాలు రాసి, నోటరీ చేసి విక్రయిస్తున్నారు. కొందరు మరో అడుగు ముందుకు వేసి ప్రహరీతోపాటు గేటు ఏర్పాటు చేసి ఇంటి నెంబర్ తీసుకునే ప్రయత్నంలో ఉన్నట్టు సమాచారం. ఈ ప్రాంతం గతంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉండగా ఇంటి నంబర్ల కేటాయింపు సులువుగా సాగింది. అయితే పాత తేదీలతోనే అక్రమంగా ఇంటి నంబర్లు తీసుకుని ప్రహరీలు, గదుల నిర్మాణాలు చేపడుతున్నట్టు సమాచారం. కేవలం ఇంటి నంబర్ తీసుకోవడం కోసమే ఓ చిన్నపాటి గది నిర్మించి ప్రభుత్వ నిబంధనలు అనుమతించకున్నా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చంటూ దళారులు ప్రచారం చేస్తున్నారు. పీసా చట్టం అమలులో ఉన్న క్రమంలో ఎవరు కొనుగోలు చేసినా ప్రభుత్వం వెనక్కి తీసుకునే అవకాశాలున్నాయి. అయినా దళారులు దందా సాగిస్తున్నారు. అయినా మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

#### ప్లాట్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వలే

సర్వే నెంబర్ 116, 117లో ప్లాట్ల ఏర్పాటు, నిర్మాణాలకు అనుమతి ఇవ్వలేదు. ఎవరైనా నిర్మాణాలు చేపడితే అది చట్టరీత్యా నేరం అవుతుంది. బాధ్యులకు నోటీసులు అందించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తప్పవు.

-సాయి, పంచాయతీ కార్యదర్శి, రాజుపేట

#### ప్లాట్లు చేస్తే చర్యలు తప్పవు

ఏజెన్సీ పరిధిలోని భూముల్లో వెంచర్లు, ప్లాట్ల ఏర్పాటుకు నిబంధనలు అనుమతించవు. ఎవరైనా వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు వేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు. కొనుగోలుదార్లు అప్రమత్తంగా ఉండాలి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. అక్రమంగా నిర్మాణాలు చేపడితే కూల్చేస్తాం.

-బి.రాజేశ్, తహసీల్దార్, నర్సంపేట

## ‘నాటి శిలాఫలకాలకే ప్రారంభోత్సవాలు..’



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులకు ఏర్పాటు చేసిన శిలాఫలకాలకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అన్నారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరంలో సీఆర్ఆర్ కింద మండలంలోని చెన్నారం, ఇల్లంద, దమ్మన్నపేట తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.24 కోట్లు కేటాయించి శిలాఫలకాలు వేసిందని గుర్తు చేశారు. అలాగే వర్ధన్నపేట మున్సిపాల్టీలో అమృత్ పథకం కింద రూ.34 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిందని చెప్పారు. ఇకనైనా నూతన పనులకు శ్రీకారం చుట్టాలని హితవు పలికారు. సమావేశంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, నాయకులు తోటకూరి రాజమణి, పూజారి సుజాత రఘు, కోదాటి పద్మ దేవేందర్, సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

ఖానాపురం : మాదకద్రవ్యాల బారిన పడితే భవిష్యత్తు అంధకారమవుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సదానందం తెలిపారు. ఆ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థాలను వినియోగిస్తే జీవితంలో కష్టనష్టాలు తప్పవన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలకు అలవడితే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి వారిని సరైన దారిలో పెట్టే దిశగా చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ సదానందం, అధ్యాపకులు రవికుమార్, సంజీవ, తిరుపతమ్మ, రాజేశ్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగం నిర్వీర్యానికి పాలకుల కుట్ర



అమరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నర్సింహారావు, నాయకులు

- పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు నర్సింహారావు

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగ నిర్వీర్యానికి కుట్ర చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు ధ్వజమెత్తారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ యూనియన్ అమరవీరుల చిత్రపటాలకు శుక్రవారం నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అమరులైన వారి ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. విద్యార్థులకు కుల, మత తారతమ్యం లేకుండా నాణ్యమైన విద్యను ఉచితంగా అందించే దిశగా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. ఇకనైనా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంతోపాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేశ్, నాయకులు రాజు, అభిరామ్, సంపత్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

దుగ్గొండి : ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య స్పష్టం చేశారు. మండలంలోని తిమ్మంపేటలో శుక్రవారం నిర్వహించిన పార్టీ మండల మహాసభకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా ప్రజలపై భారాలు మోపేందుకు తెగబడుతున్నాయని మండిపడ్డారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నాచినపల్లికి చెందిన బోళ్ల సాంబయ్య, సభ్యులుగా పుచ్చకాయల భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి, చెల్పూరి మొగిలి, అక్కపెల్లి సుధాకర్, బోళ్ల కొమురయ్య, తాళ్లపెల్లి రవి, కొంగర నర్సింహస్వామి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపల్లి బాబు, కుమారస్వామి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సంగెం : ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన వారికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల నాయకుడు కొడగాని శంకర్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతిప్రతం అందజేసింది. అనంతరం శంకర్‌రావు మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం కుటుంబాలను వదిలి అనేక కష్టనష్టాలను ఓర్చుకుని జైలు జీవితం కుడా గడిపామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు షోకాల సతీశ్, బానోత్ దేవాసింగ్, తాటికొండ ఉమామహేశ్వరి, మల్లేశ్, రాజ్‌కుమార్, బాదావత్ రమేశ్, బాలు, పెండ్లి మహిపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బిట్స్ కళాశాలలో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్సెస్ (బిట్స్) ఇంజనీరింగ్ కళాశాలలో ఎంఆర్ఎఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా 178 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా రాత పరీక్షలో 91 మంది అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ రౌండ్‌కు 40 మంది విద్యార్థులు ఎంపికవగా వారికి కంపెనీ డైరెక్టర్ శ్రీధర్ నియామక పత్రాలు అందజేశారు. ఏటా రూ.2.46 లక్షల వేతనం ఇస్తామని, బీటెక్ పూర్తి కాగానే విద్యార్థులను ఉద్యోగంలోకి తీసుకుంటామని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధి కింగ్‌స్టన్, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, ముఖ్య ప్రాంగణ నియామకపు అధికారి సురేశ్, ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఫసీ అహ్మద్ ఫర్వేజ్, స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఫణీంద్ర, టీపీఓ డాక్టర్ రణధీర్‌రెడ్డి, సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

### పశువుల రక్షణలో టీకాలు కీలకం

పర్వతగిరి : పశువులను రోగాల బారి నుంచి రక్షించడంలో టీకాలు కీలకమని పశు వైద్యాధికారి రాజు స్పష్టం చేశారు. మండలంలోని జమలాపురంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన చేపట్టి మాట్లాడారు. పాడి రైతులు పశువుల సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఆడదూడలకు జన్మనిచ్చేలా నిర్ధారించిన సెమన్‌ను అందుబాటులో ఉంచిందని తెలిపారు. అవసరం ఉన్న రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేవీఓ అమరావతి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రఘువీర్, గోపాలమిత్రలు లక్ష్మయ్య, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు, రేపు ఓటరు నమోదుకు అవకాశం

వర్ధన్నపేట : నేడు, రేపు (ఈనెల 9, 10) కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తహసీల్దార్ విజయసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండనున్న యువత సైతం ఓటరుగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ రెండ్రోజులూ ఓటరు నమోదు కోసం పోలింగ్ బూత్‌ల్లో బూత్ స్థాయి అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు. ఓటరు నమోదు కోసం ఫారం–6, అభ్యంతరాలకు ఫారం–7, సవరణలకు ఫారం–8 వినియోగించాలని సూచించారు. వెబ్‌సైట్, ఓటరు హెల్ప్‌లైన్ లేదా మొబైల్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### బంజారా యూత్‌కు రూ.5 వేల సాయం



నగదు అందిస్తున్న కార్తీక్, తదితరులు

నర్సంపేట రూరల్ : మండలంలోని ముగ్దుంపురంలో మిషన్ ముగ్దుంపురం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో చందు బంజార యూత్ అసోసియేషన్ సభ్యులకు టీషర్ట్స్ కోసం రూ.5 వేల సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ స్థాపించి ఐదేళ్లుగా పూర్తి చేసుకున్న సందర్భంగా బంజార యూత్ అసోసియేషన్ సభ్యులకు టీ షర్ట్స్ కోసం ఆర్థికసాయం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, సభ్యులు సంతోశ్, అంజన్, విజయ్, అభి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



నెక్కొండ:కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరీశ్



ఖానాపురం : కొత్తూరులో..



రాయపర్తి : మహబూబ్‌నగర్‌లో



దుగ్గొండి : మండపల్లిలో..

నెక్కొండ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్లవాడలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెడ్లవాడ పీఏసీఎస్ చైర్మన్ జలగం సంపత్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని రంగాపురం, రాగంపేట, కొత్తూరు గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యర్ర జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు సరైన తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు, సొసైటీ సీఈఓ చిట్టి రవి, ఇన్‌చార్జ్ రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని మహబూబ్‌నగర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, తొర్రూరు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాలకుర్తి సోమనాథ ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లయ్య, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని మందపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సింగతి కార్తీక్, ఏఈఓ వైజయంతి, డైరెక్టర్ సద్ది అయిల్‌రెడ్డి, ఎడెల్లి కిషన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వేను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



సంగెం : సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వేదవతి



దుగ్గొండి : స్టిక్కరింగ్ చేస్తున్న ఎంపీఓ శ్రీధర్‌గౌడ్



పర్వతగిరి : సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

సంగెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ, స్థానిక మండల ప్రత్యేక అధికారి వేదవతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించి ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కుటుంబ వివరాలు పక్కాగా సేకరించాలని స్పష్టం చేశారు. అధికారులు పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్, సీసీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలో 13 వేల 450 నివాస గృహాలను సర్వేలో భాగంగా గుర్తించినట్లు ఎంపీడీఓ లెక్కల అరుంధతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, ఏపీఓ శ్రీనివాస్, ఏఓ మాధవి, ఏఎస్ఓ పవన్‌కుమార్, సూపరింటెండెంట్ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ రేణుకాదేవి, శత్రుఘ్న రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో స్టిక్కరింగ్‌ను స్పెషల్ ఆఫీసర్ నీరజ పరిశీలించి మాట్లాడారు. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక




రాయపర్తి : మమతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



అంజని అభినందిస్తున్న జనార్దన్

పర్వతగిరి : మండలంలోని ఆర్‌డీఎఫ్ అచ్యుత పాయ్ విద్యాలయ జూనియర్ కళాశాల విద్యార్థి అంజలి జాతీయ స్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. కళాశాల ఆవరణలో అంజలిని శుక్రవారం ఆయన అభినందించి మాట్లాడారు. ఇంటర్ డిస్ట్రిక్ ఆర్టిస్టిక్స్ అండ్ రిథమిక్ జిమ్నాస్టిక్ చాంపియన్ షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అంజలి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు శ్రీనివాస్, మహేశ్, జయశంకర్, రాంబాబు, సుధాకర్, సంతోశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు..**

నర్సంపేట : ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి పరుగు పందెం రాష్ట్రస్థాయి పోటీలకు గీతాంజలి డీజీ స్కూల్ విద్యార్థి బి.చరణ్ ఎంపికైనట్లు స్కూల్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు తెలిపారు. చరణ్‌ను సుబ్బారావుతోపాటు ప్రిన్సిపాల్ కొత్తపల్లి ప్రవీణ్‌కుమార్, కోచ్ జిల్లెల శ్రీశైలం, పీఈటీలు అజయ్‌కుమార్, వసుంధర, ఉపాధ్యాయులు అభినందించారు.



నర్సంపేట : చరణ్‌ను అభినందిస్తున్న సుబ్బారావు, తదితరులు

**రెజ్లింగ్‌లో..**

నర్సంపేట రూరల్ : నర్సంపేట జెడ్పీ సెకండరీ స్కూల్ విద్యార్థులు మహమ్మద్ ముబిన్, అమీర్ 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు ఫిజికల్ డైరెక్టర్ కోట రాంబాబును స్కూల్ ఆవరణలో ఎంఈఓ కొర్ర సారయ్య, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్, ఉమా మహేశ్వర్, రవికుమార్, అభిద తబసుమ్, తదితరులు పాల్గొన్నారు.

**ఖోఖో పోటీలకు..**

రాయపర్తి : ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 సబ్ జూనియర్ ఖోఖో పోటీల్లో మండలంలోని కొండూరు హైస్కూల్ విద్యార్థి అబ్బరబోయిన మమత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను హెచ్‌ఎం పద్మలత, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.